

## పులి దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ), కౌటాల, నవంబర్ 30 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరిస్తున్న పులి ప్రజలను హడలెత్తిస్తున్నది. శుక్రవారం గన్నారం సమీపంలో పత్తి ఏరుతున్న మోర్ల లక్ష్మిపై దాడి చేసి చంపగా, శనివారం సిర్పూర్-టీ మండలం దుబ్బగూడలో రైతు సురేశ్‌పై పంజా విసిరింది. దుబ్బగూడకు చెందిన సురేశ్, అతడి భార్య సుజాత శనివారం చేనులో పత్తి తీస్తుండగా పొదల్లో శబ్దం వినిపించింది. అడవి పందులు కావచ్చని చెదరగొట్టేందుకు సురేశ్ ఆ వైపు వెళ్లాడు. పొదల్లో రెండు పులులున్నాయని, అందులోని ఒక పులి సురేశ్‌పై దాడి చేసిందని ప్రత్యక్ష సాక్షి సుజాత తెలిపింది. సురేశ్‌పై పులి దాడిని గమనించిన సుజాత కేకలు వేస్తూ.. అక్కడికి వెళ్లి కర్రలతో పులిని కొట్టే ప్రయత్నం చేసింది. అప్పటికే సురేశ్ మెడపై దాడి చేసిన పులి.. అతడిని కొంత దూరం లాక్కెళ్లింది. సురేశ్ కూడా గొడ్డలితో ఎదురుదాడి చేయడం.. అదే సమయంలో చుట్టు పక్క రైతులు, కూలీలు రావడంతో పులి సురేశ్‌ను వదిలి పారిపోయింది. సురేశ్‌ను సిర్పూర్-టీ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు.

### కల్యాణి కుటుంబానికి 10 లక్షలు: సురేఖ

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): పులి దాడిలో మరణించిన కాగజ్‌నగర్‌కు చెందిన కల్యాణి కుటుంబానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ.10 లక్షల పరిహారం అందించామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. తాజాగా సిర్పూర్(టీ) మండలం దుబ్బగూడెంలో సురేశ్ అనే రైతుపై పులి దాడి చేయడంపై మంత్రి సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

- కొత్త చైర్మన్ నియామకానికి గవర్నర్ ఆమోదం
- రేపటితో ముగియనున్న మహేందర్‌రెడ్డి పదవీకాలం
- ఐదున్నరేండ్లు చైర్మన్‌గా కొనసాగనున్న వెంకటేశం
- ట్యూషన్ టీచర్ నుంచి టీజీపీఎస్సీ చైర్మన్‌గా ప్రస్థానం
- ఉద్యోగార్థుల కష్టాలు తీర్చేందుకు ప్రయత్నిస్తా : బుర్రా వెంకటేశం



"టీజీపీఎస్సీ చైర్మన్ పోస్టు బాధ్యతాయుతమైనది. ఇది నాకు లభించిన మంచి అవకాశంగా భావిస్తా. చైర్మన్‌గా ఐదున్నరేండ్లు పనిచేసే అవకాశం ఉంటుంది. నేను కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించా. ఉద్యోగార్థుల బాధలు తెలుసు. వారు పడే కష్టాలు తెలుసు. వారి కష్టాలు తీర్చేందుకు నా వంతుగా ప్రయత్నిస్తా. సర్వీస్ కమిషన్‌కు అప్పగించిన ఉద్యోగాల భర్తీకి సంబంధించి వెంట వెంటనే నోటిఫికేషన్లు జారీచేస్తాం. పెండింగ్‌లోని ఉద్యోగాల భర్తీని సకాలంలో పూర్తిచేస్తాం."

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. నూతన చైర్మన్ నియామకానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శనివారం ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం టీజీపీఎస్సీ చైర్మన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం మహేందర్‌రెడ్డి డిసెంబర్ 2వ తేదీతో పదవీ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త చైర్మన్‌గా బుర్రా వెకంటేశంను ప్రభుత్వం నియమించింది. కొత్త చైర్మన్ నియామకానికి సర్కారు గతంలోనే నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులు ఆహ్వానించింది. మొత్తం 45 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో రిటైర్డ్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు ఉన్నారు. వారిలో చైర్మన్ పోస్టుకు బుర్రా వెంకటేశంను ఎంపికచేసిన సర్కారు ఈ నియామకం ఆమోదం కోసం ఫైల్‌ను రాజ్‌భవన్‌కు పంపించింది. దీంతో గవర్నర్ శనివారం ఆ ఫైల్‌పై ఆమోదముద్ర వేశారు. బుర్రా వెంకటేశంకు మరో మూడున్నరేండ్ల సర్వీసు ఉండగా, టీజీపీఎస్సీ చైర్మన్‌గా 62 ఏండ్ల వరకు కొనసాగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కొత్త చైర్మన్ ఐదున్నరేండ్లు అంటే 2030 వరకు కొనసాగనున్నారు. బుర్రా వెంకటేశం ప్రభుత్వ బడిలో, గురుకులంలో చదువుకుని అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుత టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డితోపాటు బుర్రా వెంకటేశం సైతం సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. ట్యూషన్ టీచర్‌గా తన ప్రస్తానాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగిన బుర్రా వెంకటేశం టీజీపీఎస్సీ చైర్మన్‌గా అత్యున్నత స్థానానికి ఎదిగారు. బుర్రా వెంకటేశం డిసెంబర్ 2న లేదా ఆ తర్వాత చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

| | |
|---|---|
| పేరు | బుర్రా వెకంటేశం |
| పుట్టిన తేదీ | 1968 ఏప్రిల్ 10న |
| తల్లిదండ్రులు | నారాయణగౌడ్, గౌరమ్మ |
| స్వస్థలం | జనగామ జిల్లా ఓబుల్ కేశవాపురం |

**చదువు:** బీఏ, ఎల్ఎల్‌బీ (1989లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలేజీలో బీఏ, ఉస్మానియా నుంచి 1992లో ఎల్ఎల్‌బీ)

**ప్రస్తుత హోదా:** విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీ

### తపన ముందు తలవంచిన విధి

బుర్రా నారాయణగౌడ్, గౌరమ్మ దంపతులకు జన్మించిన బుర్రా వెంకటేశం రెండో తరగతి చదువుతున్నప్పుడే తండ్రిని కోల్పోయారు. ఎన్నో ఒడిదొడుకుల మధ్య చదువు ముందుకుసాగింది. తనను చదివించేందుకు అమ్మ పడుతున్న కష్టాన్ని చూసి ఆ కష్టాలు తీరాలంటే పెద్ద చదువులు చదవాలని, పెద్ద ఉద్యోగం సాధించాలని చిన్నప్పుడే లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వగ్రామంలో 7వ తరగతి వరకు చదివి ఏడో తరగతిలో ఉమ్మడి వరంగల్ జిల్లా టాపర్‌గా నిలిచారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లా సర్వేల్ గురుకులంలో చేరి పదో తరగతిలోనూ టాపర్‌గా నిలిచారు. ఇంటర్ విద్య అనంతరం, అమ్మకు భారం కాకూడదని ఖర్చులకు డబ్బులు లేక ట్యూషన్స్, హోం ట్యూషన్స్ చెప్పు డిగ్రీ పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ విద్యనభ్యసించారు. ఐఏఎస్ కావాలన్న ఆశయంతో 1990లో సివిల్స్ రాసి తొలి ప్రయత్నంలోనే సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం సాధించారు. మరో ప్రయత్నంలో ఎలాంటి కోచింగ్ లేకుండా 1995లో జాతీయస్థాయిలో 15వ ర్యాంక్, ఉమ్మడి ఏపీలో టాపర్‌గా నిలిచారు. ఆయన తపన ముందు విధి తలవంచి విజయాన్ని దరిచేర్చింది. ఎప్పుడూ పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లే ఆయన ప్రస్థానం కష్టానికి ప్రతిరూపంగా, విజయానికి సంకేతంగా చెప్పుకోవచ్చు. ఐఏఎస్ కావాలంటే డిగ్రీ చదవి ఉండాలన్న ఏకైక లక్ష్యంతో డిగ్రీలో చేరారు. పైగా డిగ్రీ ఫైనల్ ఇయర్‌లోనే ఫలితాలు రాకముందే, సివిల్స్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యి ఉద్యోగం సాధించడం విశేషం.

### కీలక బాధ్యతలు

ఐఏఎస్ శిక్షణ అనంతరం బుర్రా వెంకటేశం ఆదిలాబాద్‌లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా, రంపచోడవరం, రాజమండ్రి సబ్ కలెక్టర్, వరంగల్ మున్సిపల్ కమిషనర్, చిత్తూరు, గుంటూరు జిల్లాలకు జాయింట్ కలెక్టర్‌గా, మెదక్, గుంటూరు జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఐటీ శాఖ డైరెక్టర్‌గా మెడికల్, టూరిజం కార్పొరేషన్ల ఎండీగా, హౌజింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేశారు. 2014లో తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగా సేవలందించారు. ప్రపంచ తెలుగు మహాసభల కోర్‌కమిటీ సభ్యుడిగా విజయవంతంగా పనిచేశారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి

బుర్రా వెంకటేశం పరిపాలనారంగంతోపాటు సాహిత్యరంగంలోనూ రాణించారు. స్వయంగా రచయిత కూడా. ఆయన రచించిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ ఆంగ్ల పుస్తకం ఐదు నెల్లలోనే 42వేల కాపీలు అమ్ముడయ్యాయి. గెలుపు పిలుపు, జీవనధన్య శతకం, బుద్ధంశరణం గచ్ఛామి, రామాయణ పరివారము, అనుబంధాల పూదోట వంటి పుస్తకాలు ప్రాచుర్యం పొందాయి. మెదక్ కలెక్టర్‌గా పనిచేసినప్పుడు పరిపాలనకు సోషల్ అకౌంటబిలిటీ ఇంటర్నేషన్ న్యూయార్క్ ద్వారా ఎస్ఏ 8000 సర్టిఫికెట్ పొందారు. ఆసియాలోనే తొలి సర్టిఫికెట్ ఇది. ఇందుకు రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ప్రశంసలు లభించాయి. కట్టుబానిసల విముక్తి, పేదలకు భూపట్టాల పంపిణీకి చొరవచూపినందుకు జాతీయ ఎస్సీ కమిషన్‌తోపాటు ప్రధానమంత్రి ప్రశంసలు లభించాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న బుర్ర వెంకటేశంను ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. కాగా, ఆయనను టీజీఎస్పీఎస్సీ చైర్మన్‌గా నియమించేందుకు గవర్నర్ ఆమోదం లభించగా, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు.

## 9 మంది అదనపు కమాండెంట్ల బదిలీ

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు బెటాలియన్లలో అదనపు కమాండెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న తొమ్మిది మందిని బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే బదిలీ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. 17వ బెటాలియన్‌కు చెందిన అడిషనల్ కమాండెంట్ ఎస్ శ్రీనివాసరావు 3వ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. ఇబ్రహీంపట్నానికి చెందిన టీ గంగారామ్‌ను 17వ బెటాలియన్‌కు, 10వ బెటాలియన్‌కు చెందిన కే సుబ్రహ్మణ్యంను 5వ బెటాలియన్‌కు, 5వ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎన్ పెద్దబాబును 2వ బెటాలియిన్‌కు, 8వ బెటాలియన్‌కు చెందిన కే వీరయ్యను 12వ బెటాలియన్‌కు, 12వ బెటాలియన్‌కు చెందిన ఎం జయరాజును 10వ బెటాలియన్‌కు, 15వ బెటాలియన్‌కు చెందిన పీ వెంకట రాములును 13వ బెటాలియన్‌కు, 3వ బెటాలియన్‌కు చెందిన ఎం ఐ సురేశ్‌ను 4వ బెటాలియన్‌కు, 7వ బెటాలియన్‌కు చెందిన పీ సత్యనారాయణకు డిచ్‌పల్లి బెటాలియన్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

- ఇందిరమ్మ మాడల్ హౌస్ కోసం భారీగా చెట్ల నరికివేత



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మాడల్ హౌస్ నిర్మాణం కోసం 400 గజాల స్థలాన్ని కేటాయించింది. అయితే ఆదివారం అక్కడ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కార్యాలయం ఆవరణలో పెరిగిన చెట్లను ఇలా నరికివేశారు. చెట్లు ఉన్న స్థలాన్ని కాకుండా మరోచోట మాడల్ హౌస్‌కు స్థలం కేటాయిస్తే బాగుండేదని స్థానికులు అంటున్నారు

## హమాలీ బిడ్డ.. సివిల్ జడ్జి

### ఏపీలో నియామకం

జూలపల్లి, నవంబర్ 30: హమాలీ బిడ్డ ఏపీలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ఆర్థిక ఇబ్బందులు అధిగమించి, కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్‌కు చెందిన మొగురం మొండయ్య-లక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు అనిల్, అభిషేక్, కూతురు గాయత్రీ ఉన్నారు. మొండయ్య హమాలీ పనులతోపాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఇద్దరు కొడుకులు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నారు. గాయత్రీ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, పెద్దపల్లిలోని ట్రినిటీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివారు. లా చేయాలన్న ధృడ సంకల్పంతో వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో సీటు దక్కించుకుని ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఆ తర్వాత పీజీ లా కామన్ ఎంట్రెన్స్ రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం విద్యనభ్యసించారు. అనంతరం ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇటీవల ఏపీ హైకోర్టు నిర్వహించిన న్యాయ సంబంధిత సివిల్ జడ్జి విభాగం పోటీ పరీక్షలు రాయగా.. నవంబర్ 27న విడుదలైన ఫలితాల్లో ఆమె ఎంపికయ్యారు. ఏపీలో జూనియర్ సివిల్ జడ్జిగా గాయత్రీ ఎంపిక కావడంతో గ్రామస్థులు, మిత్రులు అభినందనలు తెలిపారు.



### యువ న్యాయవాదులను ఆదుకోండి: వెంకన్న

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకోవడానికి యువ లాయర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ వైస్ ప్రెసిడెంట్ వెంకన్న కోరారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు యువ లాయర్లకు ఐదేండ్ల వరకు రూ.20 వేల ఉపకారవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉపకార వేతనాలు అందిస్తున్నాయని.. అదే తరహాలో తెలంగాణలోనూ అందించి ఆదుకోవాలని కోరారు. అడ్వకేట్లకు జీరో ప్రీమియంతో జీవిత బీమా కల్పించాలని అన్నారు.

# సోలార్ టెండర్లు బడా సంస్థలకేనా?

- పెద్ద సంస్థలకే దక్కేలా నిబంధనలు
- పీఎం కుసుమ్ స్కీం వెనుక తతంగం
- టెండర్లను ఆహ్వానించిన రెడ్‌కో సంస్థ
- ఒక మెగావాట్‌కు 3 కోట్ల టర్నోవర్ కండీషన్
- చిన్న కంపెనీలకు చివరికి మొండిచెయ్యి
- మండిపడుతున్న తెలంగాణ బిడ్డలు

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఏర్పాటుచేసే సోలార్ ప్లాంట్లు పెద్ద కంపెనీలకే దక్కనున్నాయి. ఆ మేరకే నిబంధనలు రూపొందించారన్న విమర్శలొస్తున్నాయి. ఆసక్తి ఉన్న చిన్న కంపెనీలకు మొండిచెయ్యే దక్కనున్నది. ఈ పథకం వెనుక భారీ తతంగం జరిగినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న కంపెనీలున్న తెలంగాణ బిడ్డలకు నష్టం కలిగించేలా నిబంధనలు రూపొదించినట్లు సోలార్ ఇంటిగ్రేటర్లు ఆరోపిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 4,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇటీవలే ఇంధనశాఖ అనుమతి ఇచ్చింది. దీనిలో భాగంగా ఇందిరా మహిళాశక్తి పథకం కింద మహిళా సంఘాలకు 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

### డిసెంబర్ 10 వరకు టెండర్లు

పీఎం కుసుమ్ పథకం కింద ప్లాంట్ల ఏర్పాటుకు టీజీ రెడ్‌కో సంస్థ ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానిస్తున్నది. ప్లాంట్ల డిజైన్, ఉపకరణాల సరఫరా, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, నిర్వహణకు ఆసక్తి గల ఎంప్యానల్‌మెంట్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) వెండర్ల నుంచి టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 10 వరకు టెండర్లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించింది. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఏడాదిపాటు ప్లాంట్‌ను నిర్వహించాలి, ప్లాంట్‌కు ఐదేండ్ల గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. టీజీ రెడ్‌కో విడుదల చేసిన టెండర్ నిబంధనలపైనే తెలంగాణ సోలార్ ఇంటిగ్రేటర్లు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.



### నిబంధనలను సరళీకరించాలి

చిన్న కంపెనీల నిర్వాహకులకు రెడ్‌కో రూపొందించిన నిబంధనలు ప్రతిబంధంగా మారాయి. ఈ నిబంధనలు పెద్ద కంపెనీలకే అనుకూలంగా ఉన్నాయి. రెడ్‌కో నిబంధనల ప్రకారం తెలంగాణలోని కంపెనీలు అర్హత సాధించలేని పరిస్థితి నెలకొన్నది. నిబంధనలను సరళీకరించాలి. స్థానిక విక్రేతలు, ఎంఎస్ఎంఈ కంపెనీలను ప్రోత్సహించాలి.

**- బుర్రా అశోక్‌కుమార్, తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు**

**'బడా' నిబంధనలు ఇవే..**

- బిడ్డర్‌కు గ్రిడ్ కనెక్టెడ్ గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- బిడ్డర్ గడిచిన మూడేండ్లలో ఒక మెగావాట్, 33/11 కేవీ సామర్థ్యం గల గ్రిడ్ కనెక్టెడ్ ప్లాంట్‌ను నిర్మించి, నిర్వహించిన అనుభం ఉన్నవారై ఉండాలి.
- గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో బిడ్డర్ ఏదో ఒక సంవత్సరంలో ఒక మెగావాట్‌కు మూడు కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. 10 మెగావాట్లు చేయాలంటే 30 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి.
- టెండర్ దక్కించుకున్న సంస్థకు అడ్వాన్స్ ఇవ్వరు. ఇన్‌స్టాలేషన్ పూర్తయ్యాక 70 శాతం, మూడు నెలల తర్వాత మిగతా 30 శాతం మొత్తాన్ని చెల్లిస్తారు.
- ఒక మెగావాట్‌కు 10 శాతం అంటే రూ.30 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. ఆరేండ్ల తర్వాత వాటిని తిరిగి ఇస్తారు.

## పిల్లల దత్తత దరఖాస్తులపై 4 వారాల్లోగా తేల్చండి

- పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల సంరక్షణపై 2 వారాల్లోగా నిర్ణయం తీసుకోండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): పిల్లల దత్తత కోసం తల్లిదండ్రులు చేసుకున్న దరఖాస్తులపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సంబంధిత అధికారులను ఆదేశించింది. దత్తత పేరుతో చట్టవిరుద్ధంగా పిల్లలను కొనుగోలు చేశారని పేర్కొంటూ పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారులను సంరక్షించడంపై 2 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని బాలల సంరక్షణ కమిటీకి స్పష్టం చేసింది. అక్రమంగా దత్తత తీసుకున్న పిల్లలను చట్టప్రకారం వారి తల్లిదండ్రులకు అందజేయాలన్న సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఇటీవల ఈ తీర్పు వెలువరించింది.



# 1200 మంది హెల్త్ అసిస్టెంట్ల భర్తీ రద్దు

- 2013 నాటి జీవో 1207 చట్టవ్యతిరేకం
- సుప్రీం, హైకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధం
- 90 రోజుల్లోగా పోస్టులను భర్తీ చేయాలి
- తెలంగాణ, ఏపీకి హైకోర్టు ఆదేశం
- తీర్పు వెలువరించిన ద్విసభ్య ధర్మాసనం

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ) నోటిఫికేషన్ 2002 వ్యవహారంపై హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ నోటిఫికేషన్‌లో అర్హతల వివాదంపై సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు వెలువరించిన తరువాత కూడా ప్రభుత్వం జీవో 1207 ద్వారా 1200 మందిని అడ్డదారిలో నియామకాలు చేసిందని తప్పుపట్టింది. కోర్టు తీర్పుల తర్వాత కూడా ప్రభుత్వం దొడ్డిదారిన జీవో ఇచ్చి నియామకాలు చేయడాన్ని రద్దుచేసింది. అర్హతలతో జాబితా తయారు చేసి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని తీర్పు వెలువరించింది. తమ తీర్పు వెలువడిన 90 రోజుల్లోగా అర్హులతో జాబితా సిద్ధం చేసి నియామక ప్రక్రియ చేపట్టాలని స్పష్టంచేసింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీచేసింది. దేశ, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఆ తీర్పులకు విరుద్ధంగా ప్రభుత్వం జీవో ఇచ్చి నియామకాలు చేయడం చెల్లదని తేల్చి చెప్పింది. కోర్టు తీర్పు తర్వాత తొలగించిన 1200 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి విధుల్లోకి తీసుకుంటూ 2002లో నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 1207 జారీ చేయడం చట్టవిరుద్ధమని వెల్లడించింది. కోర్టు తీర్పులను అమలు చేయకపోగా ఆ తీర్పులకు విరుద్ధంగా ప్రభుత్వ జీవో ఉన్నదని ప్రకటించింది. న్యాయస్థానాల తీర్పుల స్ఫూర్తికి విరుద్ధంగా నియామకాలు ఉన్నాయని ఆక్షేపించింది. కోర్టు తీర్పుల తర్వాత వాళ్లనే తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో అనేక సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించింది. జీవో 1207 మేరకు జరిగిన 1200 మంది ఎంపీహెచ్ఏల నియామకాలను తాము సమర్థిస్తే ప్రభుత్వం చేసిన తప్పునే తాము కూడా చేసినట్టు అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. అందుకే జీవో 1207 ప్రకారం భర్తీ చేసిన 1200 మంది ఎంపీహెచ్ఏల నియామకాలను రద్దు చేస్తున్నట్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ప్రకటించింది. హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాత 1200 మందిని తొలగించిన ప్రభుత్వం తిరిగి వారినే కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది.

